

# పక్కింటి సీతాలక్ష్మి

భార్గవి పి.రావు

**శర్వాణి అప్పుడప్పుడే పేరు** తెచ్చుకుంటున్న ఓ చిన్న సైజు రచయిత్రి, శర్వాణికి ఆమె రచనా శక్తిపైన అపారమైన నమ్మకం. సైకాలజీ ఆమెకు నచ్చిన సబ్జెక్టు. ఆమె ఇతివృత్తాలను చుట్టూ వున్న పరిసరాలను, మనుషుల్ని స్టడీ చేసి మరీ సెలెక్టు చేసుకుంటుంది, ఆమె పాత్రలూ ఎప్పుడూ మానసిక సంఘర్షణకు గురవుతూ వుంటాయి. ప్రస్తుతం ఉన్న "ట్రెండ్"ను బట్టి తనూ రిసెర్చిచేసి రాయాలని ఫ్రాయిడ్, యూంగ్‌లాంటి వాళ్ళను స్టడీ చేసింది. సరిగ్గా అర్థం కాకపోయినా నిరుత్సాహ పడలేదు.

మూర్తి మామూలు బాంక్ గుమాస్తా: తన భార్య, శర్వాణి, కథా ప్రపంచంతో ఏమీ పరిచయంలేదు. శర్వాణి రాసే కథలు చదివి ఏదో మోస్తరుగా ఉన్నా యనిపించినా, ఆమెను మెప్పించడం కోసం చాలా బావున్నాయని ఒప్పేసుకునే వాడు. బాంక్‌లో కొలీగ్స్ "ఏవోయ్, నీ భార్య కథలు రాస్తుంది కదా?" అంటే "ఆ ఏదో తన పిచ్చి" అని తేల్చేసేవాడే కాని, గర్వంగా నా భార్య ఫలానా అని ఎప్పుడూ చెప్పుకోలేదు. అతనికి శర్వాణిపైకంటే తన మూడేళ్ళ కూతురు మంజీరపైనే ప్రేమ ఎక్కువ.

శర్వాణి వాళ్ళ పక్కింట్లో ఆ రోజ అద్దెకు దిగారు సీతాలక్ష్మి, మోహన్‌లు కొత్తగా పెళ్ళయినట్టుంది. ఇంకా పిల్లా పాపా ఉన్నట్టులేరు అనుకుంది శర్వాణి. రోజూ తొమ్మిదిన్నరకు స్కూటరుపైన బయలుదేరే మోహన్‌కు కారియర్ ఆదించడానికి బయటకు వచ్చేది సీతా లక్ష్మి. ఆ టైములోనే మూర్తిని ఆఫీసుకి పంపి కాస్సేపు కిటికీదగ్గర నిలబడటం

తనకి అలవాటు. సీతాలక్ష్మిని చూసి పలకరింపుగా నవ్వింది. "కొత్తగా వచ్చారా? ఏవూరు" అంటూ మాటలు కలిపింది. పేరు పాతదైన మనిషి చక్కటిదే! వయస్సు కూడా ఇరవై కి మించి లేవు.

"ఎంతవరకు చదువుకున్నారు" అని అడిగింది శర్వాణి "ఎనిమిదో తరగతి వరకు" అని చెప్పింది

ఇలా సాగింది వాళ్ళ సంభాషణ. అటువంటి మనిషితో తను కథలు రాస్తానని చెప్పడం కూడా దండగేననిపించి ఊరుకుంది శర్వాణి.

అయినా రోజూ ఓసారి సీతాలక్ష్మి ని చూడకపోతే తోచేదికాదు శర్వాణికి. ఎందుకో ఆ అమ్మాయంటే ఓ రకమైన అభిమానం ఏర్పడింది ఎంతో అమాయకంగా, ముగ్ధలా కనిపించే ఆ అమ్మాయి సైకాలజీపై ఓ కథ రాయాలని శర్వాణి సీతాలక్ష్మిని Study చెయ్యసాగింది.

కొన్ని రోజుల తర్వాత—

"అమ్మాయ్, ఇలా అడుగుతున్నానని ఏమీ అనుకోకు. రోజూ మీ ఆయనతో, వీధి చివర్లో నిలబడి, స్కూటరుమీద వెడుతుందే-ఆ "అమ్మాయెవరు!" అని అడిగింది శర్వాణి

"ఆ, ఆ అమ్మాయా? తను సుధ మావారి ఆఫీసులో నే పని చేస్తుంది. మొన్న మా ఇంటికొచ్చారు చూళ్లేదా" అని చెప్పింది తేలిగ్గా సీతాలక్ష్మి. ఆ మాటల్లో కొంచెం కూడా ఈర్ష్య లేకపోవడం శర్వాణికి ఎంతో ఆశ్చర్యం కలిగించింది.

సుధను గురించి మరికొన్ని ఆరాలు తీసింది. ఆ అమ్మాయి మోహన్‌కంటే నాలుగేళ్ళు పెద్దదనీ, ఏవో కారణాలవల్ల పెళ్ళి చేసుకోలేదనీ-చాలా మంచావిడని మోహన్ చెప్పాడట.

"దాన్ని నువ్వు నమ్మావా? పిచ్చితల్లీ! ఈ మగవాళ్ళ సైకాలజీ చాలా కాంప్లికేటెడ్‌గా ఉంటుంది.

అన్నీ విని చిన్నగా నవ్వి ఊరుకున్న సీతాలక్ష్మిపై కొండంత కోపం వచ్చింది. ఇటువంటి మూర్ఖులకి సైకాలజీ గురించి చెప్పే బదులు మరో కథ రాసుకుంటే పుణ్యం, పురుషార్థం అనిపించింది శర్వాణికి ఆ తరువాత ఆ సంగతి పట్టించుకోనట్టు నటించినా, ఓ కన్నేసి ఉంచింది-ఏదైనా కథావస్తువు దొరక్కపోతుందా అని!

ఉన్నట్టుండి నాన్నగారికి ఒంట్లో బాలేదని ఉత్తరం వస్తే, ఉన్నపళాన బయలుదేరి వెళ్ళిపోయింది శర్వాణి, మంజీరను తీసుకుని. మూర్తికి జాగ్రత్తలు చెప్పి, ఇంటినో కంట కనిపెట్టమని సీతాలక్ష్మి చెవిన కూడా ఓ మాట పడేసి హడావుడిగా బయలుదేరింది. ఊరు చేరగానే నాన్నగారికి కొంచెం స్వస్థత చేకూరడమూ, నాన్నగారిని చూడ్డానికి వచ్చిన అన్నయ్యలు, చెల్లాయిలతో సరదాగా గడపడమూ శర్వాణికి హాయిగా అనిపించేయి. కులాసాగా ఓవారం గడిచాక, అనుకున్న దానికంటే ఒరోజు ముందుగా బయలుదేరింద హైదరాబాదుకి.

రైల్లో కూర్చున్న శర్వాణి ఆలోచనలు ఇంటిమీదికి మళ్ళాయి. దాంతోపాటూ సీతామహాలక్ష్మి మీదకు కూడా. సీతాలక్ష్మి మంచిపిల్ల. అమాయకురాలు.

ఆమెకు మరోసారి నచ్చచెప్పి ఆమె సంసారం నిలబడేలా చూడాలి ఆమె భర్త మోహన్ సుధను వలలో వేసుకోవాలనుకుంటున్నాడా లేక సుధే అతన్ని ఆకర్షిస్తోందో? ఆడదే కోరివస్తే ఏ మగాడు కాదంటాడు? దీనిపైన ఓ కథ రాసి నిర్ణయాన్ని పాఠకులకే వదిలేసి చూడాలి అనుకుంటూ నిద్రలోకి జారిపోయింది.

నాంపల్లి స్టేషను వచ్చింది. ఆ రోజు సోమవారం. మూర్తి ఆఫీసుకి వెళ్ళుంటాడని తెలిసినా ఓసారి స్టేషనంతా చూసింది. మంజీర చెయ్యి పుచ్చుకుని దిగి, కూలీతో తన చిన్న సూట్‌కేసును మోయించుకుని, ఆటో ఎక్కి "సైదాబాదు పోనీయ్" అంది. ఏదో ఆలోచనల్లో ఉండగానే ఆటో ఇంటిముందు ఆగింది. ఆటోవాడికి డబ్బిచ్చి "అరే, తలుపుకి తాళం లేదే? మూర్తి ఇంట్లోనే వున్నారా? ఒంట్లో బావులేదేమో అనుకుంటూ తలుపు తోసింది. గడియ సరిగ్గా పడలేదేమో తలుపు ఒక్కసారిగా తెరుచుకుంది. అంతే శర్వాణి కళ్ళు తిరిగాయి-ఎదురుగా చూసిన దృశ్యంతో. తన భర్త కౌగిలిలో సీతాలక్ష్మి! ఇద్దరూ ఉలిక్కిపడి శర్వాణిని చూసి వెంటనే విడిపోయారు. నీకు కథలు రాసుకోవడంలో ఉన్న ఆనందం నాకు సీతాలక్ష్మిలో దొరికాయని మూర్తి కళ్ళు చెప్పినట్టనిపించింది. మొగుణ్ణి ఎలా ఆకట్టుకోవాలో అని తాను చెప్పిన పాఠాలు సీతాలక్ష్మి కళ్ళల్లో ప్రతిఫలించాయి! సైకాలజీ తన్ను చూసి నవ్వినట్టనిపించింది.


# శ్రీ ఆంజనేయ చరిత్ర
(శ్రీ పరాశర సంహిత)

హనుమద్భక్తులకు, ఉపాసకులకు, హనుమన్మంత్ర విషయమై పరిశోధన చేయదలచినవారలకు అత్యంత సులభ శైలిలో ఒక్క తెలుగు భాషలోనే వెలువడిన శ్రీ పరాశర మహర్షిచే అందించబడిన "శ్రీ ఆంజనేయ చరిత్ర" 80 భాగములు 7 పుస్తకములుగా వెలువడినది.

7 పుస్తకముల ధర రు : 30-లు

ముందుగా రు. 30 లు ఎం.ఓ.ద్వారా పంపినవారికి పోస్టేజికి వి.పి.పి. పెట్టబడును.

శ్రీ హనుమంతునిగూర్చి పూర్తి వివరములు తెలుసుకొనుటకు, మంత్ర తంత్ర శాస్త్రము తెలుసుకొనుటకు ఈ ఒక్క గ్రంథమే అనేక విషయములను వివరించగలదు. వివరములకు :

ఎస్.ఎస్. లక్ష్మణరావు

కార్యదర్శి : శ్రీ హనుమత్సేవా సమితి

ముదిగంటివారి వీధి. సత్యనారాయణపురం. విజయవాడ-520 011.